

ఎస్.ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్వేరోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

ఘనంగా స్వేరోస్ ఆవిర్భావ దినోత్సవం

ముషీరాబాద్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి) : స్వేరోస్ 13వ ఆవిర్భావ దినోత్సవాలను స్వేరోస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తిమ్మన వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్ జెండా ఆవిష్కరించి గురుకుల పాఠశాలల వ్యవస్థాపకుడు దివంగత కలెక్టర్ ఎస్. ఆర్ శంకరన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు గురుకుల విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ఎస్.ఆర్ శంకర్ సామాజిక స్పృహతో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి నిరక్షరాస్యత నిర్మూలనకు కృషిచేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వసంత, అధికార ప్రతినిధి వంశీ, నాయకులు అనిల్, ఆజాద్, దాసు, వెంకటేష్ పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న స్వామి మునీశ్వరానంద, స్వామి వెంకటేశ్వర

నిరుపేదలను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

కవాడిగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు, ఆశ్రమాలు ముందుకు రావాలని భారత్ సేవాశ్రమ నగర అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద సూచించారు. దీపావళి పండుగను పురస్కరించుకొని బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ హనుమాన్ ఆలయం వద్ద భారత్ సేవాశ్రమ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వామి మునీశ్వరానంద, స్వామి వెంకటేశ్వరానందలు ముఖ్య అతిథులుగా హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదలు, ప్రకృతి విపత్తులు వచ్చిన సమయంలో నిరుపేదలను ఆదుకునేందుకు తమ ఆశ్రమం ముందుంటుందని అన్నారు. దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటూ నిరుపేదలకు కొత్త దుస్తులు ఉచితంగా పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సిబ్బంది, నిరుపేదలు పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్

పైప్‌లైన్ పనులను పర్యవేక్షించిన వాటర్‌వర్క్స్ మేనేజర్

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ అరుంధతీ నగర్ బస్తీలో వాటర్, సీవరేజ్ పైప్‌లైన్ పనులను అశోక్‌నగర్ వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తయితే బస్తీకి మంచినీటి, సీవరేజీ సమస్య చాలా వరకు తీరిపోతుందని తెలిపారు. ఇటీవల వినాయకచవితి, దసరా, దీపావళి పండుగలు వరుసగా రావడంతో పనుల నిర్వహణలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు వినియోగంలోకి తేవడానికి డీజీఎం కార్తీక్‌రెడ్డి పర్యవేక్షణలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, బస్తీవాసులు వాటర్‌వర్క్స్ మేనేజర్‌తో పాటు పనులు పరిశీలించి ఆయనతో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేసి తమ బస్తీ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కార్తీకమాస పవిత్రోత్సవాలు ప్రారంభం

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలోని క్షీరలింగేశ్వరస్వామి మందిరంలో కార్తీకమాస మహోత్సవాలు బుధవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీపోత్సవంలో భక్తులు తొలిరోజు కావడంతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, అర్చకులు ఏర్పాట్లు చేశారు.



నిరుద్యోగ బాకీకార్డ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిరుద్యోగ జేఏసీ నేతలు

కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డ్ పోస్టర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 24న జలవిహార్‌లో జరుగనున్న కాంగ్రెస్ నిరుద్యోగ బాకీకార్డ్ ప్రోగ్రాం పోస్టర్‌ను బుధవారం రాత్రి తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేతలు చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీ ఆవరణలో ఆవిష్కరించారు. జేఏసీ నేతలు శంకర్ నాయక్, కయ్య వెంకటేష్‌లు మాట్లాడుతూ నిరుద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక బూటకపు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు బాలకోటి, నాగరాజు, సురేష్, ప్రసాద్, రేవతి, శాంతి, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మధురంగా గాన విభావరి



సుమధుర గాయని కృష్ణవేణిని సన్మానిస్తున్న అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : గోకులం, బృందావనం సంస్థల నిర్వాహకులు, ప్రముఖ గాయకులు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో గాన విభావరి మధురంగా సాగింది. విరిసింది వసంతగానం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, సుమధుర గాయని కృష్ణవేణి, విజయరావు, రామకృష్ణ తదితరులు గాన విభావరిలో గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా గాయని కృష్ణవేణికి ఆత్మీయ సత్కారం జరిగింది. గాయనీ గాయకులు శంకర్, రామలక్ష్మి, కిరణ్మయి, సోమేష్, స్వరకల్యాణి, విజయారావు పాల్గొన్నారు.

27న 'ప్రేమ చిగురించిన శుభవేళ' కథాసంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 27న ప్రముఖ రచయిత పెద్దూరి వెంకటదాసు రచించిన ప్రేమ చిగురించిన శుభవేళ కథాసంపుటి ఆవిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలో జరుగుతుందని జీవీఆర్ ఆరాధన కార్యదర్శి వివి రాఘవరెడ్డి తెలిపారు. ఈ పుస్తకాన్ని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణ, పుష్పలత దంపతులకు పుస్తకం అంకితోత్సవం జరుగుతుందని వివరించారు.



నాయిని నర్సింహారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



రాంనగర్ చౌరస్తాలోని అమర వీరుల స్తూపం వద్ద నాయిని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, రేషం మల్లేష్, శ్యాం

రాష్ట్ర సాధన ఉద్యమాల్లో

నాయిని పోరాటం మరువలేనిది

ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన తొలి, మలిదశ ఉద్యమాల్లో తెలంగాణ తొలి హోంమంత్రి దివంగత నేత నాయిని నర్సింహారెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయిని నర్సింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడీతండాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిరిగిరి కిరణ్ ఆధ్వర్యంలో నాయిని నర్సింహారెడ్డి ఐదవ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై నాయిని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పని చేసిన నాయిని పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాయిని కార్మిక వర్గానికి ఎనలేని సేవలు అందించారని చెప్పారు. ఆయన ఆశయాల సాధన కోసం బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నాయిని ఆశయాల సాధన కోసం నాయిని నర్సింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయిని తనయుడు నాయిని దేవేందర్‌రెడ్డి, రేషం మల్లేష్, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యాం, పెంటారెడ్డి, రోషం బాలు, సోమన్‌గౌడ్, జుగేందర్, శివ, కల్వ గోపీ, కార్తీక్‌యాదవ్ పాల్గొన్నారు.

రాంనగర్ చౌరస్తాలో..

బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేషం మల్లేష్, నగర సీనియర్ నాయకుడు సిరిగిరి శ్యాం ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద నాయిని ఐదవ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి నాయిని నర్సింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాస్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, వివేక్, ముదిగొండ మురళి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా ముషీరాబాద్‌లో కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో నాయిని వర్ధంతి కారక్రమం జరిగింది. ఇందిరాపార్కు చౌరస్తాలో కల్వ గోపీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిజమైన ప్రజానాయకుడు నాయిని

చిక్కడపల్లి : నిజమైన ప్రజానాయకుడు నాయిని నర్సింహారెడ్డి అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. తెలంగాణ ఉద్యమకా



భరత్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, కార్తీక్‌యాదవ్

రుడు, తెలంగాణ తొలి హోమ్‌మంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతి కార్యక్రమం బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ చౌరస్తాలో పార్టీ సీనియర్ నేత పున్న సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు రాకేష్‌కుమార్, పున్న సత్యనారాయణ, పాశం రవి, ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, బన్ని, సురేష్ పాల్గొన్నారు.

నాయిని సేవలు మరువలేనివి : మాజీ కార్పొరేటర్

ముషీరాబాద్: పేదల సంక్షేమానికి తెలంగాణ ఉద్యమకారుడు దివంగత నాయిని నర్సింహారెడ్డి చేసిన సేవలను ప్రజలు ఎన్నటికి మరిచిపోలేరని మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ముషీరాబాద్‌లోని భరత్‌నగర్‌లో నియోజకవర్గం విద్యార్థి విభాగం ఇన్‌చార్జి కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వి. శ్రీనివాస్‌రెడ్డి నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, ముషీరాబాద్ నియోజకవర్గంలో పేద ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రాజు, ఎన్ దేవేందర్‌రెడ్డి, సిద్దిక్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.



బోలిచౌకిలో పేరామౌంట్‌కాలనీలో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, బీఆర్ఎస్ నగర నాయకులు సుధాకర్‌గుప్తా తదితరులు



కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న భోలక్‌పూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

- మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా

రాంనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆయన సతీమణి మాగంటి సునితను గెలిపిస్తాయని మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా తెలిపారు. బుధవారం షేక్‌పేట డివిజన్‌లోని టోలిచౌకి పెరామౌంట్‌కాలనీ, ఐఏఎస్ కాలనీల్లో ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బి సుధాకర్‌గుప్తా, డి రవియాదవ్, రాజశేఖర్ గౌడ్, వల్లాల శ్యాంయాదవ్, జుగేందర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపైన, కాంగ్రెస్ అభ్యర్థిపై తీవ్ర వ్యతిరేకత ఉందని అవి బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారుతాయని చెప్పారు.

ముషీరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునిత విజయం సాధించడం ఖాయమని భోలక్‌పూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునితకు మద్దతుగా భోలక్‌పూర్ నుంచి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు జూబ్లీహిల్స్‌లోని షేక్‌పేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. అనంతరం బింగి నవీన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అన్నివర్గాల ప్రజల సంక్షేమ, నగర అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్‌ను గెలిపించి అభివృద్ధికి నాంది పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, బీసీ సెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ప్రవీణ్, అజయ్, పాషా, రవళి, అక్బర్ పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

యూసుఫ్‌గూడలో ఎమ్మెల్యే ప్రచారం

రాంనగర్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడలో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి సునీతను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అంబర్‌పేట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమైతే ఉలేమా సంస్థకు షబ్బీర్ అహ్మద్ సేవలు మరువలేనివి

రాంనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : జమైతె ఉలేమా సంస్థకు ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు అజ్రత్ మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ అందించిన సేవలు మరువలేనివని పలువురు జమైతె ఉలేమా సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలోని జామ్ మసీదు వద్ద జరిగిన సమావేశంలో జమైతే ఉలేమా కలకత్తా అధ్యక్షుడు మౌలానా సిద్దికుల్లా చౌదరి, మహారాష్ట్ర విభాగం అధ్యక్షుడు మౌలానా హఫీజ్ నదీం సిద్దికి జమైతే ఉలేమా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హఫీజ్ పీర్ మాలిక్ అహ్మద్ సాబేర్, మౌలానా ముసద్దిక్ అలీకాసిమ్, జమిబాతుల్ ఉమా హైదరాబాద్ జమైతే ఉలేమా హైదరాబాద్ జిల్లా కోశాధికారి ముఫ్తి మహ్మద్ ఇలియాస్ అమ్మద్, అమిద్ ఖాస్మి నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హఫీజ్ యూనస్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా హఫీజ్, అంబర్‌పేట ఉలేమా అధ్యక్షులు మౌలానాలు మాట్లాడుతూ జమైతే ఉలేమా సంస్థకు దీర్ఘకాలంగా అధ్యక్షులుగా కొనసాగిన అజ్రత్ మౌలానా హఫీజ్ పీర్ షబ్బీర్ అహ్మద్ ఇటీవల మృతిచెందారని తెలిపారు. ఆయన సేవలు సంస్థ మరచిపోదని వారు పేర్కొన్నారు.

మత్స్యకారులకు రూ.5వేల కోట్లు కేటాయించాలి

- తెలంగాణ మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ



టీ.ఎం.కె.ఎం.కె.ఎస్ జెండాను ఆవిష్కరించిన బాలకృష్ణ తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల వృత్తి రక్షణ, ఉపాధి, జీవిత భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం (టీ.ఎం.కె.ఎం.కె.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం టీ.ఎం.కె.ఎం.కె.ఎస్ 25వ ఆవిర్భావ వేడుకలను ముషీరాబాద్‌లోని చేపల మార్కెట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లెల్లెల బాలకృష్ణ టీ.ఎం.కె.ఎం.కె.ఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి మత్స్య సొసైటీ బ్యాంక్ అకౌంట్‌లో రూ.10లక్షలు జమచేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి టీ.ఎం.కె.ఎం.కె.ఎస్ అనేక పోరాటాలు చేసిందని మత్స్యకారులకు అండగా ఉంటూ వారిని అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీ.ఎం.కె.ఎం.కె.ఎస్ జిల్లా అధ్యక్షురాలు గాండ్ల అమరావతి, ప్రధాన కార్యదర్శి కొప్పు పద్మ, నాయకులు రేణుక, అన్నపూర్ణ, నర్సింగ్‌రావు, అరుణ, బాలమణి పాల్గొన్నారు.



ముషీరాబాద్ డివిజన్‌లోని ఆశీర్‌ఖానా ఎదురు వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసినందుకు అభినందిస్తూ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సన్మానం చేసి స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విద్యనభ్యసించాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, మాజీమంత్రి ఎం శ్రీనివాస్‌రావు తదితరులు

రాంనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : లక్ష్య సాధనే లక్ష్యంగా విద్యార్థులు విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, కళాశాలకు, దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అవంతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరిగిన విద్యారంభ ఓరియంటేషన్ డేలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి కాలేజెస్, ఉస్మానియా యూనివర్సిటీ, జెఎన్‌టీయూ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో విద్యారంభ పేరుతో బుధవారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామ్‌వెంకటేష్ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు విద్యను నేర్చుకొని తమ లక్ష్య సాధన కోసం పాటుపడాలని సూచించారు. కళాశాల నుంచి బయటకు వెళ్లే వరకు విద్యార్థులు ఉద్యోగంతో బయటకు వెళ్లేలా కష్టపడి చదవాలని సూచించారు. మాజీమంత్రి అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు ఎం శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో 1992లో అవంతి విద్యాసంస్థలను స్థాపించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు దాదాపు ఐదు లక్షల మంది విద్యార్థులు కళాశాలలో చదివి బయటకు వెళ్లి ఉన్నత శిఖరాలను అధిరోహించారని చెప్పారు. ప్రస్తుతం ఉభయ రాష్ట్రాలలోని విద్యా సంస్థలలో 20వేల మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరికి బంగారు భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా తమ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జెఎన్‌టీయూ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపాల్, అండ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ సింధు, ఉస్మానియా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం వెంకట్‌దాస్, హెచ్ఎంఎ ప్రెసిడెంట్ అల్వాల్ దేవేంద్‌రెడ్డి, బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు డాక్టర్ శ్రీలత, కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ వై జయప్రద, ప్రొఫెసర్ అప్పారావు, డాక్టర్ వీహెచ్ విశేషకల్పసాయి, డాక్టర్ అజ్మల్‌హుస్సేన్ పాల్గొన్నారు.



శాస్త్ర సమీక్ష కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు, సమితి సభ్యులు

26న శాస్త్ర సమీక్ష కార్యక్రమం

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాంస్కృతిక సంస్థ సిద్ధనాట్య కళాసమితి ఆధ్వర్యంలో శాస్త్ర సమీక్ష కార్యక్రమాన్ని ఈనెల 26న ఉదయం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్ష, కార్యదర్శులు వాణీరమణ, ఆర్. చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నృత్యంలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల పాఠ్యాంశాలపై అనుభవజ్ఞులైన గురువులు సూచనలు, సలహాలు అందజేస్తారని వివరించారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కె. హనుమంతరావు, సంస్థ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఆసక్తి గల వారు 9959803097, 9959502301 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



మాట్లాడుతున్న చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ రమణ

రేపు చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ధర్నా

రాంనగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ఈనెల 24న నిర్వహిస్తున్న ధర్నాకు చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ మేకపోతుల వెంకటరమణ తెలిపారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ధర్నాలో చేతివృత్తిదారుల అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీని పార్టీపరంగా కాకుండా చట్టపరంగా అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో చేతివత్తి దారుల సంఘాల ప్రతినిధులు పి ఆశయ్య, లెల్లెల బాలకృష్ణ, ఉడుత రవీందర్, వెంకటనర్సయ్య, గుమ్మడి రాజు నాగరాజు, చెన్నారం మల్లేషం, రాల్లబండి కుమారస్వామి, నరహరి, గోపాల్, యాదగిరిచారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్, హైదరాబాద్-2 పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్‌లు తెలిపారు. శివం, హర్రాజ్‌పెంట, పార్శిగుట్ట, జగదీశ్ మార్కెట్, గోల్కొండ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, బౌద్ధనగర్, శివాలయం, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, టీటీడీ, లేక్‌ప్లాజా(పార్క్ హోటల్) పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బర్కత్‌పురాలో గ్యార్వీ ఉత్సవాలు



బర్కత్‌పురాలోని రెడ్డి కాలేజీ సమీపంలో హజరత్ సయ్యద్ వలీవుల్లా సాహబ్ దర్గా అధ్యక్షుడు ఎంఏ వహీద్‌అలీ ఆధ్వర్యంలో బుధవారం గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యార్వీ ఉత్సవాలు మతసామరస్యతను కాపాడేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యుడు యూసుఫ్, దర్గా సభ్యులు సయ్యద్ సుబాణి, యూసుఫ్, చోటు, ఎజాజ్ హుస్సేన్, షేక్ పాషా, ఫిరోజ్‌ఖాన్, నయుంఖాన్, జావిద్‌ఖాన్, ఇమ్రాన్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి